బాబు వచ్చే... జాబు పోయే!

- చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం
- వలంటీర్ వ్యవస్థకు మంగళం
- నిరుద్యోగులను నిలువునా ముంచిన వైనం



ఇంటివద్దకే రేషన్ కార్యక్రమం రద్దు చేయడంతో కార్యాలయానికే పరిమితమైన ఎండీయు వాహనాలు

ఎన్పీకుంట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉద్యోగులపై వేధింపులు అధికమయ్యాయి. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని, లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు, అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులను నిండా ముంచేశారు. అధికారం చేపట్టి సంవత్సన్నర కాలం అవుతున్నా కొత్త ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేక పోగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న చిరుద్యోగులను తొలగించి పొట్టకొట్టారు. వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందనే సామెతను తలపిస్తోంది కదిరి నియోజకవర్గం లోని ఉద్యోగులు, నిరుద్యోగుల పరిస్థితి. బాబు వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయని, ఉపాధి లభిస్తుందని గత ఎన్నికల్లో టీడీపీ నాయకులు గడప గడపకూ తిరిగి ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగ అవకాశాల కల్పన దేవుడెరుగు. చిరుద్యోగుల ఉద్యోగాలను ఒక్కొక్కటిగా ఊడగొట్టే పనిలో పడ్డారు.

వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామంటూ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన వలంటీర్ వ్యవస్థ విజయవంతంగా అమలై దేశవ్యాప్తంగా ఎంతో పేరుపొందింది. వలంటీర్ వ్యవస్థను తొలగించమని, అలాగే కొనసాగిస్తామని, అంతే కాకుండా జీతం నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికి తీరా గెలిచాక వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదంటు తొలగించారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. చివరకు ఆ రూ.5 వేల జీతం కూడా లేకుండా చేశారు. దీనితో కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయామంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు..

వయసు పైబడి రేషన్‌షాపుకు వెళ్లలేని వారు, దివ్యాంగులకు ఉపయుక్తంగా ఉన్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేశారు. ఇంటింటికి వెళ్లి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఎండీయూ డ్రైవర్లకు, ఆపరేటర్లకు జీవనోపాధి లేకుండా పోయింది. డ్వాక్రా సంఘాల్లో పద్దులు రాసే వీఓఏలను సైతం వదల్లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు వ్యక్తులకు మద్యం విక్రయాలకు వీలు కల్పించడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేసే చిరుద్యోగులు బజారున పడ్డారు. ఇదే క్రమంలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లను బలవంతంగా తప్పించారు. ఇలా వేలాది మంది చిరుద్యోగులు జీవనోపాధి కోల్పోయి బతుకుదెరువుకు అల్లాడిపోతున్నారు.

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన చిరుద్యోగుల వివరాలు

మండలం	వలంటీర్లు	ఎండీయూ ఆపరేటర్లు	ఫీల్డ్ అసిస్టెంట్లు
కదిరిటౌన్	480	15	13
కదిరిఅర్బన్	187	09	18
గాండ్లపెంట	119	05	14
ఎన్పీకుంట	166	06	16
తనకల్లు	277	07	16
నల్లచెరువు	171	07	14
తలుపుల	---	---	--

ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించాం



ప్రభుత్వం, ప్రజలకు మధ్యవారధిలా పారదర్శకంగా పని చేశాం. కరోనా సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించాం. ఎన్నికల సమయంలో వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో ఖాళీగా ఇంటి వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి.

– రామాంజులు, మాజీ వలంటీర్, అలుగుంటివారిపల్లి

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తెలిపిన సూపర్‌సిక్స్ హామీల్లో నిరుద్యోగ భృతి ఒకటి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేంత వరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర వుతున్నా ఇంత వరకు నిరుద్యోగభృతిపై స్పష్టమైన ఆదేశాలు ప్రకటించలేదు. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి అమలు చేసి ప్రభుత్వం అండగా నిలబడాలి.

–వై.ప్రశాంత్, వెలిచలమల, ఎన్పీకుంట మండలం

మోసగించడం చంద్రబాబు నైజం



కట్టెలతండాలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి అర్బన్: ప్రజలను మోసగించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. గురువారం వరిగిరెడ్డిపల్లి, చిగురుమానుతండా, చవిటితండా, కొండమనాయునిపాళెం గ్రామంలో మండల కన్వీనర్ మణికంఠనాయిక్ ఆధ్వర్యంలో 'చంద్రబాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఇస్తానని మేనిఫెస్టోలో ప్రకటించారని అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానని బీరాలు పలికి నేడు ముఖం చాటేస్తున్నాడని విమర్శించారు. తమను మోసం చేసిన చంద్రబాబును వచ్చేఎన్నికల్లో తగిన బుద్ధి చెపుతామని ప్రతి గడపలో మహిళలు చెపుతున్నారని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం చూస్తుంటే ఈ పథకం అమలు సాధ్యం కాదని చెప్పకనే చెపుతున్నారని అర్థమవుతోందన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచ్‌లు రాఘవ, లక్ష్మీనాయక్, లక్ష్మీబాయ్, రజనీష్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీబాయ్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు కృపాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రైతు విభాగం నేత జైనుల్లా, ఎస్టీసెల్ నాయకులు కృష్ణానాయక్, విశ్వనాథ్, శ్రీనివాసులు, ఇర్షాద్, రాంప్రసాద్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, నరసింహులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరగాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరగాలని, ఇందుకు అందరి సహకారం అవసరమని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, పోలీస్, అగ్నిమాపక, నీటి పారుదలశాఖ అధికారులతోపాటు గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వినాయక విగ్రహాలను వాడవాడలా ప్రతిష్ఠించనున్నారని, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి నిర్వాహకులకు తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, శుభ్రత, చెత్త తొలగింపు తదితర వాటిని మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. వినాయక మండపాలు, నిమజ్జనం సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండటంతోపాటు తగిన వెలుతురు ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో అత్యవసర సేవలు, అంబులెన్స్ సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

బత్తలపల్లి: గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన సిబ్బందితో కలిసి వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ, వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, డీఎస్పీ శివనారాయణస్వామి నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పట్టణ, రూరల్ సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



లోక్‌నాథరెడ్డి(ఫైల్)



లోక్‌నాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బత్తలపల్లి: లింగారెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోక్‌నాథ్‌రెడ్డి(51) గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం గుండెల్లో మంటగానూ, నొప్పిగా ఉందంటూ చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్నాక వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య సుహాసినితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నేతలు గ్రామానికి చేరుకుని మృతునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మాజీ సర్పంచులు ముల్లగూరు సంజీవు నాయుడు, చెడిపోతుల గోపాల్, నాయకులు గుర్రం నరసింహారెడ్డి, బోయపాటి సూరీ, ఈడిగ కాశప్ప, బొగ్గుల సూరీ, బొంతల ప్రతాప్, నారాయణస్వామి, ఈశ్వరయ్య ఉన్నారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం చేరదలచిన విద్యార్థులు ఈనెల 26లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు కింద ఓసీలు రూ.400, బీసీలు రూ.300, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చొప్పున చెల్లించాలన్నారు. ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల ధ్రువ పత్రాలను ఈనెల 25 నుంచి 28వతేది వరకు పరిశీలిస్తామని తెలిపారు. కోర్సులు, కళాశాల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవడానికి 24 నుంచి 28 వరకు అవకాశం ఉందన్నారు. వెబ్ ఆప్షన్ మార్పు 29వతేది, సీట్ల కేటాయింపు 31న జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని వివరించారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత బస్సు కోసం మహిళల పాట్లు





ఒకరినొకరు తోసుకుంటూ బస్సు ఎక్కుతున్న మహిళలు

ధర్మవరం అర్బన్: ఉచిత బస్సు కోసం మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. పెద్దసంఖ్యలో మహిళలు ఉండటం, బస్సులు తక్కువగా ఉండటంతో తప్పడం లేదు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం ఉచిత బస్సు ఎక్కేందుకు మహిళలు పోటీ పడ్డారు. సీట్ల కోసం ఒకరికొకరు తోసుకుంటూ వెళ్లారు. ప్రభుత్వం స్పందించి ఉచిత బస్సుల సంఖ్య పెంచాలని మహిళలు కోరుతున్నారు.

జోనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీ రన్నర్స్‌గా జిల్లా జట్టు



క్రీడాకారులను అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి వేదికగా ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగిన అమరావతి చాంపియన్‌షిప్ 2025 జోనల్‌స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రతిభ చూపి రన్నర్స్‌గా నిలిచింది. సెమీ ఫైనల్స్‌లో నంద్యాల జట్టును ఓడించి ఫైనల్స్‌కు జట్టు చేరుకుంది. ఫైనల్స్‌లో చిత్తూరుతో హోరాహోరీగా పోరాడి టోర్నీ రన్నర్స్‌గా నిలిచింది. ప్రతిభ చాటిన క్రీడాకారులను గురువారం స్థానిక బాస్కెట్‌బాల్ కోర్టులో ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అభినందించారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తాడిమర్రిలో మానవహారం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని గణేష్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సుజాత, పద్మావతి, మంజుల, షర్మిల, స్వాతి, రేణుక, వేదవతి, సీఐటీయూ నాయకులు పైపల్లి గంగాధర్, రాంమోహన్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీరభద్రయ్యస్వామి ఆలయం ఎదురుగా మారవహారం ఏర్పాటు చేశారు. సీఐటీయూ నాయకులు నడిపి ఓబిలేసు, భారతి, విజయలక్ష్మీ, ఆదెమ్మ, ప్రభావతి, చైతన్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్ మాట్లాడుతు అంగన్‌వాడీల వేతనాలను పెంచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు శ్రీదేవి,రజియా, పుష్పలత, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ధర్మవరం రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచి పోతుకుంట, గొళ్లపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న విశా ఫెర్రర్

ధర్మవరం రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆర్డీటీ మహిళా విభాగ డైరెక్టర్ విశా ఫెర్రర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక షిర్డీ సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో అక్షర మహిళా బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశా ఫెర్రర్‌తో పాటు షీబా, రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వ్యాపార వేత్తలుగా తయారు చేయడమే బ్యాంక్ ఉద్దేశమన్నారు. ఈ బ్యాంక్‌ను మహిళలే నడుపుకుని వాటి ద్వారా వచ్చే లాభనష్టాలను వారే పంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏరియా సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో యూటీఎఫ్ మాజీ నేత మృతి



హనుమంతరావు (ఫైల్)

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ మాజీ నేత శిడ్లగట్టు హనుమంతరావు(65) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, హెచ్.రామంజినేయులు, సకల చంద్రశేఖర్, సురేష్, రాంప్రసాద్, రమీజాబీ, హరికృష్ణ, అమర్ నారాయణరెడ్డి, శివయ్య, వినయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి తదితరులు హనుమంతరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జేవీవీ నేత డాక్టర్ ఆదిశేషు, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నేత ఎస్‌హెచ్ బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ నేతలు జెవీ రమణ, అయుబ్‌ఖాన్ సంతాపం తెలియజేశారు.

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



శ్రీ కృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: తుంపర్తి గ్రామంలో గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక తుంపర్తి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా వారం రోజుల పాటు శ్రీ కృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సమితి తుంపర్తి కమిటీ అధ్యక్షులు కె.అప్పిరెడ్డి, సభ్యులు శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యోగానందరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, గోవిందు, రామ్మోహన్‌రెడ్డి, కాంతమ్మ, శ్రీలత, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో..

చెన్నేకొత్తపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పూల పల్లకీలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

అబాకస్ పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ



పథకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: ఈ నెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన 24వ యూసిమాస్ జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీల్లో అతికఅలీ, ఫరాజ్ అలీతోపాటు జెడ్ కేటగిరిలో సెకండ్ రన్నరప్‌గా సాబీరా, ఫోర్త్ రన్నరప్‌గా గణేష్, ఐదో రన్నరప్‌గా అర్శియా, అమన్ నిలిచినట్లు ఫ్రాంఛైజీ డైరెక్టర్ సఫియాభాను తెలిపారు.

జ్వాలాపురంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

బత్తలపల్లి: జ్వాలాపురం ఎస్సీ కాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. అనంతపురానికి చెందిన వేదపండితులు ఆధ్వర్యంలో గురువారం మహాగణపతి పూజ ప్రారంభం, మహాసంకల్ప పూర్వక మహాపూర్ణాహుతి పంచాగ్ని, దేవతావిసర్జన, భస్మారాధన, అగ్ని ప్రదక్షిణ, అనంతరం పెద్దమ్మతల్లి వారి అభిషేక కుంభోత్సవం అనంతరం గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. తర్వాత పెద్దమ్మ తల్లి వారికి నవకుంభాభిషేకము మహా ప్రాణప్రతిష్ఠ జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. నిర్వాహకులు లక్ష్మీనారాయణతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్: పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలోనున్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం నుంచి గొట్లూరు 11 కేవీ ఫీడర్ బదులుగా 33 కేవీ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీ లక్ష్మీనరసింహారెడ్డి గురువారం తెలిపారు. దీంతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గొట్లూరు, చంద్రబాబు నగర్, మార్కెట్‌యార్డ్ తదితర ప్రాంతాల్లో రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేసు నమోదు

నల్లమాడ: తహసీల్దార్ ఫిర్యాదు మేరకు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ నరేంద్ర రెడ్డి తెలిపిన మేరకు..వేళ్లమద్ది గ్రామానికి చెందిన మనోహర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అతని భూమికి పైన భూములు కలిగిన రైతులకు దారి ఇవ్వకుండా అడ్డుకుటున్నాడు. ఈ విషయంపై మనోహర్ దాయాదులు కోర్టుకు వెళ్లడంతో కోర్టులో కేసు నడుస్తోంది. అయితే రెవెన్యూ అధికారులు తన భూమికి సంబంధించి సక్రమంగా రీ సర్వే చేయలేదని ఆరోపిస్తూ గురువారం మనోహర్ పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని నానా దుర్భాషలాడటంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. తహసీల్దార్ రంగనాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముదిగుబ్బ: మంగళమడక గ్రామంలో ప్రసన్న ఆంజనేయస్వామి, మహా గణపతి, సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా స్వామి వార్ల విగ్రహాలకు గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం విగ్రహాలను ధాన్యంలో ఉంచి పూజలు చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ ఏఈగా కొండారెడ్డి

కనగానపల్లి: మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా కొండారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా రెగ్యులర్ ఏఈ లేక మండలంలోని రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధర్మవరంలో పనిచేస్తున్న ఏఈ కొండారెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. కనగానపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నీరు నిల్వ లేకుండా చూడండి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది గురువారం న్యామద్దెల పంచాయతీ పరిధిలోని హరియాన్‌చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఇళ్ల వద్ద నీటితొట్టిల్లో నిల్వ చేసిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉన్న నీటిని పారబోశారు. డెంగీ, మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి, ఆశావర్కర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.